మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

16.2.2026 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 298 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



# దాయాదిపై దండయాత్ర

## పాకిస్తాన్‌ను ఏకిపారేసిన టీం ఇండియా



**ప్రపంచకప్‌లో అప్రతిహత రికార్డు**
**ఇషాన్ కిషన్ విజృంభణ**
**బౌలర్ల సమష్టి ప్రదర్శన**
**టీమ్ఇండియాకు సూపర్-8 బెర్తు**

టీ20 ప్రపంచకప్‌లో భారత్ దుమ్మురేపింది! ప్రియమైన ప్రత్యర్థి పాకిస్థాన్‌పై బెబ్బులిలా విరుచుకుపడింది. సండే బ్లాక్‌బస్టర్‌లో టీమ్ఇండియా పాక్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. మెగాటోర్నీలో తమ అజేయ రికార్డును అప్రతిహతంగా కొనసాగిస్తూ ఏకంగా ఎనిమిదోసారి విజయఢంకా మోగించి..మరో మ్యాచ్ మిగిలుండగానే సూపర్-8 బెర్తు ఖరారు చేసుకుంది.

వివరాలు 5లో..



## అదేరోజు అవిశ్వాస తీర్మానం ఓటింగ్

స్పీకర్ తొలగింపుపై 9న చర్చ

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు వెల్లడి

.. వివరాలు 4లో



## ఆరోగ్యంపై రాజీపడబోం

ఆరోగ్యం ప్రాథమిక హక్కు.. రాజీపడే ప్రసక్తే లేదు

ఎఫ్ఎస్ఎస్ ఏఐకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

.. వివరాలు 4లో

# పాలకులం కాదు మేం సేవకులం

## అన్నదాన్ని మరోలా అర్థం చేసుకు న్నారు నేనే రాజు..నేనే మంత్రి అంటే వక్రీక రించారు

**ముఖ్యమంత్రినీ నేనే.. మునిసిపల్ మంత్రినీ నేనే..ఎన్నికల్లో గెలుపోటములకు బాధ్యత నాదేనని అర్థం**

**మునిసిపల్ ఎన్నికల ఫలితాలు 90%మాకే అనుకూలం**

**పేదలను పరిపాలనలో భాగస్వాములను చేశాం**

**దళితుడిని అధ్యక్షా అని మైక్ అడిగేలా పైన కూర్చోబెట్టాం**

**ప్రభుత్వంలో 30 శాతం పదవులు ఎస్సీలకు ఇచ్చాం**

**నల్లమలలో 20 ఎకరాల్లో సేవాలాల్ పుణ్యక్షేత్రం**

**వచ్చే ఏడాది జయంతి వేడుకలు అక్కడే నిర్వహిస్తాం**

**ప్రతి తండాకు బీటీ రోడ్లు, సోలార్ పంపుసెట్లు మంజూరు**

**సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి**



**జనతా న్యూస్, హైదరాబాద్ :** 'నేనే రాజు.. నేనే మంత్రి' అని తాను చెప్పిన విషయాన్ని కొందరు వేరే విధంగా అర్థం చేసుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాము పాలకులం కాదని, సేవకులమని, ఈ విషయాన్ని తాను ఏనాడో చెప్పానని తెలిపారు. తాను పాలకుడిగా ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవ చేయడానికే ప్రజలు తనకు అవకాశం ఇచ్చారని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని

మిగతా 2 లో



# గొప్ప ఆర్థిక కేంద్రంగా భారత్

**వాణిజ్య ఒప్పందాల్లో బలమైన స్థితిలో ఉండి చర్చలు**

**పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ**

**జాగ్రత్తగా తయారుచేసిన స్క్రిప్టు ప్రకారమే ఇంటర్వ్యూ: కాంగ్రెస్**

అంతర్జాతీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా స్థిరమైన వృద్ధితో భారత్ నేడు ప్రపంచానికి గొప్ప ఆర్థిక వృద్ధి కేంద్రంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఇతర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద (ఎఫ్‌టీఏ) చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాలు నిర్వహించగలుగుతోందని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాల విషయంలో ఆత్మవిశ్వాసంతో బేరమాడే స్థితిలో లేకపోవటంతో ఒప్పందాలు కుదరలేదని విమర్శించారు.

వివరాలు 3 లో..

## దేశానికి దగా చేశారు

వాణిజ్య ఒప్పందంతో దేశాన్ని అమ్మేశారు: రాహుల్



4

# మున్సిపల్ పట్టాభిషేకాలకు ముహూర్తం నేడే

## మ. 12.30 గంటలకు మేయర్లు, ఛైర్మన్ల ఎన్నిక

**హంగ్.. మెలికలు మలుపులు**

**క్యాంపులు వీడని కార్పొరేటర్లు, కౌన్సిలర్లు**

**క్షణక్షణం మారుతున్న రాజకీయ పరిణామాలు**

**స్వతంత్రుల చుట్టూ మూడు పార్టీలు**

**మధ్యవర్తుల రంగప్రవేశం**

**అధికార, ప్రతిపక్షాల బంపర్ ఆఫర్లు**

**తెరవెనక ఆర్థిక లావాదేవీలు**

హైదరాబాద్ : రాష్ట్రంలో మున్సిపల్



2

BioAsia 2026 TechBio Unleashed
AI, AUTOMATION & THE BIOLOGY REVOLUTION

## రేపటి నుంచి బయో ఏషియా సదస్సు

'టెక్-బయో'లో శక్తి కేంద్రంగా తెలంగాణ

హెచ్ఐసీసీలో 2 రోజుల పాటు నిర్వహణ

50దేశాల నుంచి 3వేల మంది ప్రతినిధులు

ఏఐతో లైఫ్ సైన్సెస్‌లో మార్పులపై దృష్టి

2

# కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకుంటాం

## బీఆర్ఎస్ అభ్యర్థులను ఎత్తుకెళుతున్నారు

**కాంగ్రెస్ అరాచకాలను సాగనివ్వొద్దు**

**హంగ్ మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ గెలిచే అవకాశాలు ఎక్కువ**

**కాంగ్రెస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారు : కేటీఆర్**

3



## కేటీఆర్‌పై వారంలో చార్జిషీట్!

ఫార్ములా ఈ-కారు రేసు కేసులో ఏసీబీ దాఖలు
కేటీఆర్‌ను ఏ1గా పేర్కొంటూ అభియోగపత్రం
అన్ని పత్రాలను సిద్ధం చేసుకుంటున్న అధికారులు

# రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

**తెలంగాణ ఆర్థిక సుస్థిరత సాధించాలి.**

**పరమ శివుడి సన్నిధిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక పూజలు**

**మధిర మృత్యుంజయ స్వామి ఆలయంలో సీఎం రేవంతో పాటు మంత్రివర్గ సహచరుల గోత్రనామాలతో అర్చన**



**హైదరాబాద్:** "మా సర్కారు వర్ధిల్లాలె.. రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలె.. తెలంగాణ ఆర్థిక సుస్థిరత సాధించాలె.. అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరమశివుడిని వేడుకున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కాంక్షిస్తూ.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన సతీమణి నందినితో కలిసి మధిరలోని గంగా పార్వతీ సమేత మృత్యుంజయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ పర్యటనలో ప్రధాన ఘట్టంగా, స్వామివారి గర్భాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, అలాగే రాష్ట్ర మంత్రివర్గంలోని కేబినెట్ మంత్రులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్క, తుమ్మలనాగేశ్వర రావు, జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్, వాకిటి శ్రీహరిల పేరిట వారి గోత్రనామాలతో భట్టి విక్రమార్క దంపతులు ప్రత్యేక అర్చన చేయించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు విజయ వంతం కావాలని, పాలకవర్గంపై స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఈ సందర్భంగా మొక్కులు చెల్లించుకున్నారు.

### పూర్ణకుంభంతో ఘన స్వాగతం

వైరా నదీ తీరాన కొలువై ఉన్న మృత్యుంజయ స్వామి ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి దంపతులకు ఆలయ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో ఆశీర్వచనాలు పలికి గర్భాలయంలోకి తీసుకెళ్లారు. అనంతరం దంపతు లు స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ మండపంలో అర్చకులు డిప్యూటీ సీఎం దంపతులకు వేద ఆశీర్వచనం చేసి,స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మహాశివరాత్రి పురస్కరించుకొని మధిరలో భక్తులకు కల్పించిన సౌకర్యాలను కూడా ఈ సందర్భంగా ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

స్నానాల లక్ష్మీపురం గ్రామంలో మహాశివరాత్రి వేడుకలు

మరోవైపు ఖమ్మంజిల్లా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ పర్వదినాన్ని పురస్కరించుకు ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దంపతులు గ్రామంలోని శ్రీ పార్వతీ సమేత రామలింగె 'శ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి దంపతులకు డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధు లు ఘనస్వాగతం పలికారు. అనంతరం దేవాలయానికి చేరుకున్న వారికి ఆలయవేద పండితులు పూర్ణకుంభంతో సాదరంగా ఆహ్వానిం చారు. మహాశివరాత్రి పుణ్యకాలం సందర్భంగా భట్టి విక్రమార్క దంపతులు రామలింగేశ్వర స్వామి వారి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థప్రసాదా లను అందజేశారు. లోకకల్యాణం కోసమే ఈ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఈ సందర్భంగా భట్టి పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని భట్టి విక్రమార్క క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్నానాల ఘాట్, కళ్యాణ మండపం, రథశాల పనులతో పాటు వైరా నదిపై నిర్మించిన రిటైనింగ్ వాల్ను ఆయన నిశితంగా పరిశీలించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న చిన్న ఫంక్షన్ హాల్ భవిష్యత్తులో శ్రీ రామలింగేశ్వర స్వామి భక్తులతో పాటు వైరా పరిసర గ్రామాలకు చెందిన సుమారు 50 వేల మంది ప్రజలకు ఎంతో ఉపయోగపడనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మూడు రోజుల పాటు సాగే తిరునాళ్లలో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, వివిధ స్టాల్స్, జాయింట్ వీల్ను ఆయన సందర్శించారు. తిరునాళ్లకు విచ్చేసిన భక్తులతో ఆత్మీయంగా ముచ్చ టించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడగా, చిరునవ్వుతో వారితో కలిసి ఫొటోలు దిగి సందడి చేశారు.

# విప్ ప్రకారమే ఓటు వేయాలి

**బీఆర్ఎస్ అభ్యర్థులను ఎత్తుకెళుతున్నారు**

**కాంగ్రెస్ అరాచకాలను సాగనివ్వొద్దు**

**హంగ్ మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ గెలిచే అవకాశాలు ఎక్కువ**

**కాంగ్రెస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారు : కేటీఆర్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 15 :** మునిసిపల్ ఎన్నికల సదర్భంగా రాష్ట్రంలో దాదాపు 34 చోట్ల హంగ్ పరిస్థితులున్నాయని, ఆయా ప్రాంతా ల్లో కాంగ్రెస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కార్పొరేటర్లు, కౌన్సిలర్లను ఎత్తుకుపోవడం, ప్రలోభపెట్టడం, పోలీసులను ఇంటింటికి పంపించడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా కాంగ్రెస్, బీజేపీల దోపిడీని అడ్డుకునేందుకు కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని తాము ముందుకు వచ్చినట్లు తెలిపారు. సీపీఐ, కాంగ్రెస్ ఇప్పటికే పొత్తులో ఉన్నాయని, ఆ పార్టీలు కొత్తగూడెంలో మేయర్ పదవి పంచుకోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదన్నారు.సింగరేణి కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం సాగిస్తామని,

కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న దోపిడీని అడ్డుకోవడమే తమ లక్ష్యమని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ కలిసి సింగరేణి దోపిడీలో భాగస్వాములై సంస్థను నష్టపరిచేవిధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సింగరేణి సంస్థ ప్రయోజనాలు, కార్మికుల హక్కుల కోసం గతంలో పోరాడినట్లుగానే.. భవిష్యత్తులోనూ పోరాడుతామన్నారు. బీఆర్ఎస్ హయాంలో సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వపరంగా నిర్వహించామని గుర్తు చేశారు.

# కేటీఆర్‌పై వారంలో చార్జిషీట్!

**ఫార్ములా ఈ-కారు రేసు కేసులో ఏసీబీ దాఖలు**

**కేటీఆర్‌ను ఏ1గా పేర్కొంటూ అభియోగపత్రం**

**అన్ని పత్రాలను సిద్ధం చేసుకుంటున్న అధికారులు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 :** ఫార్ములా ఈ-కారు రేసు కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు ఈ వారమే కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయనున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా పేర్కొంటూ నేరాభియోగ పత్రాన్ని సిద్ధం చేస్తున్నారు. కేసు విచారణ దాదాపు పూర్తయిందని, న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేయడమే తరువాయి అని ఉన్నతాధికారులు తెలిపారు. చార్జిషీట్‌కు ఇప్పటికే తుదిరూపం ఇచ్చిన ఏసీబీ అధికారులు.. ఈ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు డీవోపీటీ అనుమతి కోసం ఆగారు. తాజాగా డీవోపీటీ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి రావడంతో ఆ విషయాన్ని ప్రభుత్వం ఏసీబీకి తెలియజేసింది. దీంతో ఏసీబీ అధికారులు ఈ వారంలో చార్జిషీట్ దాఖలుకు కావాల్సిన అన్ని పత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకు కీలకమైన పలు ఎలక్ట్రానిక్, డిజిటల్ సాక్ష్యాధారాలను సేకరించారు. ఫార్ములా ఈ-కారు రేసు వల్ల హెచ్ఎండీఏకు రూ.75.88 కోట్ల నష్టం జరిగిందన్న విషయాన్ని రుజువు చేయడానికి కావాల్సిన అన్ని ఆధారాలను సేకరించారు. ఫార్ములా ఈ-ఆపరేషన్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్న ఏస్ నెక్స్ట్‌జెన్ కంపెనీకి కారు రేసు బాధ్యతలు అప్పగించడం, దానికి ప్రతిఫలంగా ఆ సంస్థ నుంచి బీఆర్ఎస్ పార్టీకి రూ.45 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు రావడం క్విడ్ ప్రోకోలో భాగమేనన్న విషయాన్ని చార్జిషీట్‌లో ఏసీబీ అధికారులు పొందుపరచనున్నట్లు తెలుస్తోంది. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గతేడాది నవంబరులో అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఫార్ములా ఈ-కారు రేసుకు సంబంధించి 2024 డిసెంబరు 18న ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీని ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరో కేసు నమోదు చేసింది. ఈ మేరకు అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, కేటీఆర్‌లను ఈడీ, ఏసీబీ అధికారులు విచారించారు. చార్జిషీట్‌లో కేటీఆర్ తదితరులు నిధుల దుర్వినియోగానికి, మోసానికి పాల్పడ్డారని, నేరపూరిత కుట్రలో భాగస్వామి అయ్యారని, ఇతరులకు లాభం కలిగించే విధంగా ప్రవర్తించారని ఏసీబీ అధికారులు పేర్కొనబోతున్నట్లు సమాచారం.



# ఎవరి వ్యూహాలు వారికి ఉంటాయి

**కరీంనగర్‌లో బీజేపీకి మెజారిటే లేదు**

**కాంగ్రెస్ నుంచి మేయర్ కావాలనుకుంటున్నాం: పొన్నం**

**వేములవాడ టౌన్, ఫిబ్రవరి 15 :** మునిసిపల్ కార్పొరేషన్లలో ఎవరి వ్యూహాలు వారికి ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివ్షసతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తామే గెలిచామని బండి సంజయ్ ప్రకటించుకున్నారని.. బీజేపీ నుంచి 30మంది కార్పొరేటర్లుగా గెలిస్తే మేయర్ పదవి ఎలా దక్కుతుందని ప్రశ్నించారు. కరీంనగర్‌లో 66 కార్పొరేటర్ స్థానాలు ఉన్నాయని, ఎక్స్ అఫీషియో సభ్యులుగా స్థానిక ఎమ్మెల్యే, మానకొండూరు ఎమ్మెల్యే, ఎంపీలతో కలిపి ఆ సంఖ్య 69కి చేరుతుందని, అలాంటప్పుడు బీజేపీకి మెజారిటీ ఎలా వస్తుందని నిలదీశారు. రాజకీయపార్టీగా కాంగ్రెస్‌కు చెందిన వారే మేయర్ కావాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. గతంలో తాము 13సీట్లు గెలిచినపుడు కరీంనగర్‌లో మేయర్ పదవిని దక్కించుకున్నామని, ఇప్పుడు కూడా అన్ని రాజకీయ పార్టీల సూచనల మేరకు వ్యవహరిస్తామని చెప్పారు.

# గిరిజన ప్రాంతాల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం

**ఐటీడీఏ నిధులతోనే ఏజెన్సీల్లో అభివృద్ధి: బీజేపీ**

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 :** గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా ప్రకటించినా.. సరైన నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా అందిస్తున్న నిధులతోనే గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోందని స్పష్టం చేశారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడారు. సేవాలాల్ జీవితం బీజేపీ సిద్ధాంతాలకు దగ్గరగా ఉందని అన్నారు. పర్యావరణాన్ని కాపాడే దేవుడిగా సేవాలాల్ మహారాజ్‌ను గిరిజన సమాజం భావిస్తుందని తెలిపారు. ట్రైబల్ కమిషన్, ప్రత్యేకంగా ట్రైబల్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు వంటివి మోదీ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి సంబంధించి తీసుకున్న నిర్ణయాలన్నారు. ములుగులో సమ్మక్క-సారలమ్మ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుతో గిరిజన ప్రాంతాల్లో ఉన్నత విద్యావకాశాలు మెరుగుపడ్డాయని వివరించారు.

# యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్‌కు 600 కోట్లు

**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి**

**యాదాద్రి అఖండ జ్యోతి రథయాత్ర ప్రారంభం**



**హైదరాబాద్ , ఫిబ్రవరి 15 :** హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ రెండో దశకు కేంద్ర ప్రభుత్వం రూ.600 కోట్లు మంజూరు చేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కోరారు. ప్రధాని త్వరలో తెలంగాణలో పర్యటించనున్నారని అప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేస్తే మోదీ చేతుల మీదుగా ఎంఎంటీఎస్ రెండో దశకు భూమి పూజ చేస్తామని తెలిపారు. ఎంఎంటీఎస్ ఏర్పాటుచేస్తే హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు వెళ్లే భక్తులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. బర్కత్‌పుర యాదాద్రిభవన్ నుంచి యాదగిరిగుట్ట వరకు నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి 32వ అఖండ జ్యోతి రథయాత్రను కిషన్‌రెడ్డి ప్రారంభించి.. మాట్లాడారు. ఏటా అఖండ జ్యోతి రథయాత్రను నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామాలగుండా ఈ రథయాత్ర సాగడం వల్ల ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందన్నారు.


# బీసీ రిజర్వేషన్ల చట్టం తర్వాతే పరిషత్ ఎన్నికలు నిర్వహించాలి

**మేయర్, చైర్మన్ పదవుల్లో బీసీలకు 50% ఇవ్వాలి: ఆర్.కృష్ణయ్య**

**హైదరాబాద్, ఫిబ్రవరి 15 :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు చట్టబద్ధం చేసిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల్లో అన్యాయం చేసినా.. బీసీలు 57% స్థానాలను దక్కించుకుని సత్తా చాటారన్నారు. బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేశ్, బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జీ.అనంతయ్య ఆధ్వర్యంలో ఆదివారం 14 బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు వెలువడ్డాకే పరిషత్ ఎన్నికలకెళ్లాలని, లేకపోతే రాష్ట్రాన్ని అగ్ని గుండంగా మారుస్తామని హెచ్చరించారు. మునిసిపాలిటీ చైర్మన్/చైర్‌పర్సన్, నగర పాలక సంస్థ మేయర్ పదవుల్లో బీసీలకు 50% కేటాయించాలన్నారు. ఇప్పటికే 64 సార్లు ఢిల్లీకెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. బీసీ రిజర్వేషన్లపై ఒక్కసారి కూడా ప్రధాని వద్దకు అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్లలేదని ఆర్.కృష్ణయ్య ఆరోపించారు.

# రైతులకు మోదీ వంచన

## వాణిజ్య ఒప్పందంతో దేశాన్ని అమ్మేశారు: రాహుల్



**న్యూఢిల్లీ :** భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. ఆయన మన రైతులను వంచించారని, దేశాన్ని అమ్మేశారని ఆరోపించారు. ఇది అన్నదాతల భవిష్యత్‌కు సంబంధించిన అంశమన్నారు. భారత వ్యవసాయ పరిశ్రమపై పరాయిదేశం పెత్తనం దీర్ఘకాలం కొనసాగేందుకు అనుమతిస్తున్నారా అని ఆదివారం 'ఎక్స్'లో నిలదీశారు. ప్రధానిపై ఈ సందర్భంగా ఐదు ప్రశ్నలు సంధించారు. ఇది ఇవాళ్టి వ్యవహారం కాదని.. భవిష్యత్‌కు కూడా సంబంధించిందని స్పష్టంచేశారు. పత్తి రైతులు, ఎగుమతిదారుల ప్రయోజనాల పరిరక్షణలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆయన శనివారం కూడా ధ్వజమెత్తారు. బంగ్లాదేశ్‌తో వాణిజ్య ఒప్పందంతో అమెరికా ఆ దేశ జౌళి ఉత్పత్తులపై సుంకం మినహాయించిందని.. దీనివల్ల భారత జౌళి పరిశ్రమ సర్వనాశనమవుతుందని విమర్శించారు. ఇదిలా ఉండగా, యూపీఏ హయాంలో మంత్రి కపిల్ సిబల్.. 2010లో ఎప్‌స్టిన్ నిధులతో నడుస్తున్న సంస్థ నుంచి అవార్డు తీసుకున్నారని బీజేపీ తెలిపింది. దీనిపై రాహుల్‌గాంధీ పార్లమెంటులో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది.

### రాహుల్ అడిగిన 5 ప్రశ్నలు

అమెరికా జన్యుమార్పిడి (జీఎం) పంట అయిన మొక్కజొన్న పొడిని దిగుమతి చేసుకోవడంలో అర్థమేమిటి? భారతీయ పశుసంపదతో ఈ జన్యు పొడిని తినిపిస్తారా? దీనివల్ల మన పాల ఉత్పత్తులు ఇక అమెరికాపై ఆధారపడాల్సిందేనా?

జీఎం సోయా నూనెను దిగుమతి చేసుకుంటే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర , రాజస్థాన్ సహా దేశవ్యాప్తంగా సోయా రైతులపై ప్రతికూల ప్రభావం పడదా?

అదనపు ఉత్పత్తుల దిగుమతి అంటే అందులో ఏమున్నాయి? పప్పులు.. ఇతర పంటలను అమెరికా నుంచి దిగుమతి చేసుకోవాలన్న ఒత్తిడికి ఇది సూచిక కాదా?

వాణిజ్యేతర అడ్డంకులు తొలగించాలంటే అర్థమేంటి? జన్యుమార్పిడి పంటలపై తన దృఢవైఖరిని భారత్ సడలించుకోవాలని.. పంటల సేకరణ, మద్దతు ధరలు, బోనస్‌లను కుదించాలని అమెరికా భవిష్యత్‌లో ఒత్తిడి తెస్తుందా?

ఒక్కసారి అమెరికా వ్యవసాయ దిగుమతులకు మన మార్కెట్ ద్వారాలు తెరిచామంటే ఏటికేడాదీ మరింత విస్తృతం చేయాల్సి ఉంటుంది. దీనిని అడ్డుకుంటారా.. లేక క్రమంగా మరిన్ని పంటలను దిగుమతి చేసుకుందామంటారా?

# స్పీకర్ తొలగింపుపై 9న చర్చ



**తవాంగ్ :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై మలివిడత బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే మార్చి 9న చర్చ జరుగుతుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వెల్లడించారు. అదే రోజు సభలో ఓటింగ్ కూడా జరుగుతుందన్నారు. ఆదివారం ఆయన అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్‌లో ఓ వార్తాసంస్థతో మాట్లాడారు. రెండో విడత సమావేశాలు మొదలయ్యే తొలి రోజునే అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టాలనేది సభా నిబంధనగా రిజిజు పేర్కొన్నారు. వచ్చే నెల 9 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే మలివిడత సమావేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయని.. ముఖ్యమైన బిల్లులతో పాటు ఓ కీలక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. ఆ బిల్లేమిటో ఇప్పుడే బహిర్గతం చేయబోమన్నారు. తొలి విడతలో మాదిరిగానే ఈసారి కూడా సభా కార్యకలాపాలను విపక్షాలు అడ్డుకుంటే.. అది వాటికే నష్టం చేస్తుందని హెచ్చరించారు. లోక్‌సభలో ఐదు శాఖలు, రాజ్యసభలో మరో ఐదు శాఖల బడ్జెట్‌కు సంబంధించిన డిమాండ్లపై చర్చ జరుగుతుందన్నారు. సభలు నడవడానికి విపక్షాలు సహకరించకపోతే గిలెటిన్ చేసుకుపోతామని హెచ్చరించారు. పశ్చిమబెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ రాష్ట్రాల అసెంబ్లీలకు, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీకి ఏప్రిల్లో ఎన్నికలు జరగనున్నాయని గుర్తుచేశారు. కీలకమైన బిల్లు సహా ముఖ్యమైన బిల్లులు తెచ్చి వాటన్నిటినీ ఆమోదింపజేసుకుంటామని తెలిపారు. జమిలి ఎన్నికల బిల్లేనా అడుగగా.. ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని.. పార్లమెంటరీ కమిటీ తన నివేదికకు ఇంకా తుది రూపం ఇవ్వలేదని చెప్పారు. చర్చలో పాల్గొనకుంటే విపక్షాలకే నష్టమని పునరుద్ఘాటించారు. వాటి మధ్య ఐక్యత లేదన్నారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానంపై టీఎంసీ సంతకం చేయలేదని గుర్తుచేశారు.

### తారిఖ్ రహ్మాన్ ప్రమాణ స్వీకారానికి ఓం బిర్లా

బంగ్లాదేశ్ ప్రధానిగా ఫిబ్రవరి 17న ప్రమాణస్వీకారం చేయనున్న తారిఖ్ రహ్మాన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఢాకాలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీని బంగ్లాదేశ్ ఆహ్వానించింది. అయితే స్పీకర్ ఓం బిర్లా భారత ప్రభుత్వం తరఫున ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని విదేశీ వ్యవహారాల శాఖ ఆదివారం తెలిపింది.

# ప్యాకేజ్డ్ ఆహారంపై 'హెచ్చరిక' ఉండాల్సిందే!

## ఆరోగ్యం ప్రాథమిక హక్కు.. రాజీపడే ప్రసక్తే లేదు

## ఎఫ్‌ఎస్‌ఎస్ ఏఐకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, :** ప్రజల ఆరోగ్యంతో ఆటలాడొద్దని సుప్రీంకోర్టు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏను హెచ్చరించింది. ఆరోగ్యం ప్రజల ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. ప్రజారోగ్యం విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని తేల్చిచెప్పింది. ఇకపై ప్యాకేజ్డ్ ఆహారంపై 'హెచ్చరిక' ముద్ర తప్పనిసరిగా ఉండాల్సిందేని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ)ను ఆదేశించింది. ప్యాకెట్లలోని ఆహారంలో అధిక చక్కెర, ఉప్పు, కొవ్వుకు సంబంధించి వినియోగదారుడికి అర్థమయ్యేలా ప్యాకెట్ ముందు భాగంలోనే స్పష్టమైన హెచ్చరికల లేబుళ్లు తప్పనిసరి చేయాలని పేర్కొంది. ప్యాకేజ్డ్ ఫుడ్‌కు సంబంధించి '3ఎస్ అండ్ అవర్ హెల్త్ సొసైటీ' దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం ఈమేరకు ఆదేశాలు ఇచ్చింది. ప్యాక్ చేసిన ఆహార పదార్థాల్లో చక్కెర, ఉప్పు, కొవ్వు పదార్థాలు ఎంతమేర ఉన్నాయో తెలిపే 'ముందు వైపు హెచ్చరిక లేబుళ్ల' విషయంలో ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ దాఖలు చేసిన అఫిడవిట్‌పై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్యాకెట్లపై స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పేర్కొంది. పిటిషనర్ తరఫు న్యాయవాదివాదిస్తూ.. ప్యాకెట్లపై చక్కెర, సోడియం, కొవ్వుల మోతాదు గురించి బోల్డ్ అక్షరాలతో హెచ్చరికలు ఉంటేనే ప్రజలు అప్రమత్తం అవుతారని కోర్టుకు తెలిపారు. ఈ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం.. కేవలం చర్చలు, సమావేశాలతో కాలక్షేపం చేయొద్దని ఎఫ్‌ఎ స్‌ఎస్‌ఏఐకి సూచించింది. ఈ అంశానికి సంబంధించి 4వారాల్లో సమగ్ర నివేదికతో రావాలని ఆదేశించింది.

# శక్తితోనే సాధించాం!

## వాణిజ్య ఒప్పందాల్లో బలమైన స్థితిలో ఉండి చర్చలు

## పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

## జాగ్రత్తగా తయారుచేసిన స్క్రిప్టు ప్రకారమే ఇంటర్వ్యూ: కాంగ్రెస్




**న్యూఢిల్లీ :** అంతర్జాతీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా స్థిరమైన వృద్ధితో భారత్ నేడు ప్రపంచానికి గొప్ప ఆర్థిక వృద్ధి కేంద్రంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఇతర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద (ఎఫ్‌టీఏ) చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాలు నిర్వహించగలుగుతోందని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాల విషయంలో ఆత్మవిశ్వాసంతో బేరమాడే స్థితిలో లేకపోవటంతో ఒప్పందాలు కుదరలేదని విమర్శించారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఆదివారం ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ నుంచి వివిధ దేశాలతో ఎఫ్‌టీఏలు, దేశ వృద్ధి ప్రస్థానం, వికసిత్ భారత్ భవిష్యత్ లక్ష్యాలు తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

### బలమైన స్థానంలో ఉండి బేరమాడాం

అమెరికాతో ట్రేడ్ డీల్ విషయంలో ప్రతిపక్షాల విమర్శలను ప్రధాని తిప్పికొట్టారు. ట్రేడ్ డీల్స్ చర్చల్లో బలమైన స్థానంలో ఉండి బేరసారాసాలు నిర్వహించామని తెలిపారు. 'ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించటంతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగింది. దానివల్లే మేం బలమైన స్థితిలో ఉండి వాణిజ్య ఒప్పంద చర్చల్లో బేరసారాలు నిర్వహించగలిగాం. వస్త్రాలు, తోలు, కెమికల్స్, చేతివృత్తులు, రత్నాలు తదితర రంగాల్లో ఎంఎస్ఎంఈ పరిశ్రమలు మరింత విస్తరించేలా ఎఫ్‌టీఏలను డిజైన్ చేశాం' అని ప్రధాని మోదీ విమర్శించారు.

### ప్రైవేటు రంగానిదే కీలకపాత్ర

దేశ అభివృద్ధిలో ఇకపై ప్రైవేటు రంగమే కీలకపాత్ర పోషించనుందని ప్రధాని తెలిపారు. ఆవిష్కరణలు, దీర్ఘకాలిక సామర్థ్యం, అంతర్జాతీయ పోటీని తట్టుకొనే విషయాల్లో ప్రైవేటు రంగ సంస్థలు ధైర్యంగా పెట్టుబడులు పెట్టడంపైనే వికసిత్ భారత్ తర్వాతి దశ ఆధారపడి ఉందని చెప్పారు. వికసిత్ భారత్ ఆవిష్కరణలో మహిళలు కీలకపాత్ర పోషించనున్నారని పేర్కొన్నారు. 'వచ్చే పదేళ్లలో నిర్మాణాత్మక సంస్కరణలు, శక్తిమంతమైన ఆవిష్కరణలు, పరిపాలనలో మరింత సరళత అనే మూడు లక్ష్యాల సాధనకు ప్రాధాన్యం ఇస్తాం. స్థిరమైన సంస్కరణలు, ప్రైవేటు రంగంలో ధైర్యంగా పెట్టుబడులు పెట్టడం, మౌలిక వసతుల కల్పనను కొనసాగించటం, డిజిటల్ పరివర్తనలపైనే దేశ వృద్ధి ఆధారపడి ఉంది. ప్రాథమిక స్థాయి నుంచి సంస్కరణలు చేపట్టడం వల్లనే నేడు ప్రపంచానికి భారత్ డిజిటల్ లీడర్‌గా ఎదిగింది. డాటా సెంటర్లు యువతకు భారీగా ఉద్యోగాలు కల్పించగలవు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలను మనదేశంలో డాటా సెంటర్లు ఏర్పాటుచేసేందుకు ఆహ్వానిస్తున్నాం. తర్వాతి తరం టెక్నాలజీ విప్లవానికి నాయకత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉంది' అని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.


### మా ప్రతి బడ్జెట్ ప్రత్యేకమే..

రాష్ట్ర, జాతీయ స్థాయిలో కలిపి తాను గత 25 సంవత్సరాలుగా ప్రభుత్వాధినేతగా ఉన్నానని మోదీ గుర్తుచేశారు. ఈ 25 ఏళ్లలో తాము రూపొందించిన ప్రతి బడ్జెట్ దేశాభివృద్ధిలో దేనికదే ప్రత్యేకమైనదని తెలిపారు. ఒక్కటి కూడా సాదాసీదా బడ్జెట్ కాదని పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా స్వల్పకాలిక లక్ష్యాలతో రూపొందించినది కాదని, దేశ దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యాలను సాధించేందుకు రూపొందించినదని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మన రక్షణ రంగాన్ని ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ప్రధాని తెలిపారు. అందులో భాగంగానే 2026–27 బడ్జెట్‌లో రక్షణ రంగానికి నిధులు పెంచినట్లు చెప్పారు. కాగా, ప్రధాని ఇంటర్వ్యూపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. చాలా జాగ్రత్తగా రూపొందించిన స్క్రిప్టు ప్రకారం ఇంటర్వ్యూ సాగిందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ప్రధాని పబ్లిసిటీ స్టంటులో ఇదో భాగమని ఎద్దేవా చేశారు.

# వైట్ కాలర్ ఉగ్ర గ్రూపు!

## 'అన్సార్ ఇంటెరిమ్' పేరుతో ఏర్పాటు చేసిన 'ఉగ్ర' డాక్టర్లు

## ఢిల్లీ పేలుడు ఘటన దర్యాప్తులో సంచలన విషయాలు



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో గతేడాది జరిగిన కారు పేలుడు ఘటనపై దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఉగ్రవాదం వైపు ఆకర్షితులైన డాక్టర్లు అందరూ 'అన్సార్ ఇంటెరిమ్' అనే కొత్త ఉగ్రవాద గ్రూపును ఏర్పాటు చేసుకున్నట్లు వెల్లడైంది. వాస్తవానికి 'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్‌లో అరెస్టయిన డాక్టర్లందరూ 2016 నుంచి ర్యాడికలైజ్ అయినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. 'అన్సార్ ఇంటెరిమ్' గ్రూపు ద్వారా జమ్ముకశ్మీర్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు ఇతర ప్రాంతాల్లో విధ్వంస కార్యకలాపాలకు పాల్పడాలనేది వారి లక్ష్యమని విచారణలో ఆ డాక్టర్లు చెప్పినట్లు తెలిసింది. క్రియాశీల ఉగ్రవాదులతో తమకున్న సంబంధాలన్నీ తెగిపోయినందున కొత్త గ్రూపు ఏర్పాటు చేయాల్సి అవసరం ఏర్పడిందని వారు వెల్లడించారు. నిందిత డాక్టర్లు ముజమిల్ గన్నీ, ఉమన్ ఉన్ నబీ, ఆదిల్, అతని సోదరుడు ముజఫర్‌తో పాటు మౌల్వీ ఇర్ఫాన్, కారీ అమీర్, తుఫైల్ ఘాజీలు 2022లో శ్రీనగర్‌లోని ఓ ఈద్గాలో సమావేశమయ్యారని ఓ అధికారి తెలిపారు. ఈ సమావేశంలో 'అన్సార్ ఇంటెరిమ్' గ్రూపును ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. దీనికి ఆదిల్‌ను చీఫ్‌గా నియమించుకున్నారు. మౌల్వీ ఇర్ఫాన్‌ను డిప్యూటీ చీఫ్‌గా, గన్నీ ట్రెజరర్‌గా అనుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# భారత పోలియో వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్‌వో ఆమోదం

## బయోలాజికల్-ఈ సంస్థ ఎన్‌వోపీవో-2కు ప్రీక్వాలిఫికేషన్

**జెనీవా :** కొత్త రకం పోలియో వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లోని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బయోలాజికల్–ఈ లిమిటెడ్ సంస్థ అభివృద్ధి చేసిన కొత్త ఓరల్ పోలియో వ్యాక్సిన్ (ఎన్‌వోపీవీ–2)కు ప్రీక్వాలిఫికేషన్(పీక్యూ) ఆమోదం తెలిపింది. ఈ వ్యాక్సిన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించడంతో డబ్లూహెచ్‌వో దీనికి అనుమతి ఇచ్చింది. టైప్–2 పోలియో వైరస్ రకం వ్యాప్తిని అరికట్టడానికి, మెరుగైన జన్యు స్థిరత్వాన్ని అందించడానికి ఎన్‌వోపీవీ–2ను తయారు చేశారు. డబ్లూహెచ్‌వో ఆమోదం లభించడంతో.. బయోలాజికల్–ఈ సంస్థ ఏడాదికి 600 మిలియన్ డోసుల వ్యాక్సిన్లు ఉత్పత్తి చేయగలదని అంచనా వేస్తున్నారు. ఇండోనేషియాకు చెందిన పీటీ బయో ఫార్మా నుంచి సాంకేతికతను పొందిన బయోలాజికల్–ఈ సంస్థ సొంతంగా ఈ టీకాలు ఉత్పత్తి చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా యూనిసెఫ్ సహా ఐరాస ఆధ్వర్యంలో పనిచేసే సంస్థలు ఈ టీకాలను కొంటాయి.

### ఎన్‌వోపీవో-2 అత్యంత సురక్షితం..

'నోవెల్ ఓరల్ పోలియో వ్యాక్సిన్' (ఎన్‌వోపీవో–2) అనేది జన్యుపరమైన మార్పులు చేసిన కొత్తరకం పోలియో వ్యాక్సిన్. సాధారణ పోలియో టీకాలతో పోలిస్తే ఇది అత్యంత సురక్షితమైనది. కొత్తరకం పోలియో వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో ఇది జన్యుపరంగా అధిక స్థిరత్వం కలిగి ఉంటుంది. 1980ల తర్వాత ప్రపంచవ్యాప్తంగా సాగిస్తున్న పోరాటంతో పోలియో 99 శాతానికిపైగా తగ్గింది. అయితే ఆఫ్రికా, ఆగ్నేయాసియాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవల పోలియో వైరస్ కేసులు బయటపడ్డాయి.

# 3 రోజుల్లో 6వేల మంది ఊచకోత

## సూడాన్‌లో ఆర్ఎస్ఎఫ్ బలగాల మారణహోమం!

## ఐక్యరాజ్యసమితి నివేదికతో వెలుగులోకి



**కైరో :** ఆఫ్రికా దేశం సూడాన్‌లో పారామిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్ఎస్ఎఫ్) బలగాలు దారుణానికి పాల్పడ్డాయి. గతేడాది అక్టోబరు చివర్లో డార్ఫర్ ప్రాంతంలో ఈ బృందాలు జరిపిన క్రూరమైన హింసాకాండలో మూడు రోజుల్లోనే 6వేల మందికి పైగా మరణించారు. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. సూడాన్ పశ్చిమ ప్రాంతంలోని ఎల్–ఫాషర్ నగరాన్ని స్వాధీనం చేసుకోవడంలో భాగంగా ఆర్ఎస్ఎఫ్ తీవ్రమైన యుద్ధ నేరాలకు పాల్పడిందని తెలిపింది. ఆర్ఎస్ఎఫ్, దాని అనుబంధ అరబ్ మిలిటెంట్లు 18 నెలల ముట్టడి అనంతరం గత అక్టోబరు 26న డార్ఫర్‌లో సూడన్ సైన్యానికి మిగిలిన ఏకైక బలమైన కోట ఎల్–ఫాషర్‌ను ఆక్రమించాయి. ఈ క్రమంలో ఎల్–ఫాషర్‌తో పాటు, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించాయి. అక్టోబరు 25, 27వ తేదీల మధ్య ఈ నగరంలో ఉంటున్న దాదాపు 4,400 మందిని హతమార్చగా, పారిపోవడానికి ప్రయత్నించిన మరో 1,600 మందిని బలగాలు ఊచకోత కోశాయి. ఇందులో సామూహిక హత్యలు, మరణశిక్షలు, లైంగిక హింస, అపహరణలు, నిర్బంధాలు తదితర దారుణాలకు పాల్పడినట్లు 29 పేజీల నివేదిక పేర్కొంది. వీటిలో చాలావరకూ దాడులు జాతి ఆధారంగానే జరిగాయని తెలిపింది. ఎల్–ఫాషర్‌లో సుమారు వారం రోజుల పాటు జరిగిన మారణకాండలో మృతుల సంఖ్య ఇంకా చాలా ఎక్కువగానే ఉండొచ్చని నివేదిక పేర్కొంది. అయితే ఈ నివేదికపై ఆర్ఎస్ఎఫ్ వర్గాలు స్పందించలేదు.

# పాకిస్థాన్ చిత్తు

## సూపర్8.. పాక్‌పై భారత్ ఎనిమిదో విజయం

### ప్రపంచకప్‌లో అప్రతిహత రికార్డు ఇషాన్ కిషన్ విజృంభణ
### బౌలర్ల సమష్టి ప్రదర్శన టీమ్ఇండియాకు సూపర్-8 బెర్తు





కొలంబో: టీ20 ప్రపంచకప్‌లో భారత్ దుమ్మురేపింది! ప్రియమైన ప్రత్యర్థి పాకిస్థాన్‌పై బెబ్బులిలా విరుచుకుపడింది. సండే బ్లాక్‌బస్టర్‌లో టీమ్ఇండియా పాక్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. మెగాటోర్నీలో తమ అజేయ రికార్డును అప్రతిహతంగా కొనసాగిస్తూ ఏకంగా ఎనిమిదోసారి విజయఢంకా మోగించి..మరో మ్యాచ్ మిగిలుండగానే సూపర్-8 బెర్తు ఖరారు చేసుకుంది. కొలంబో గడ్డ మీద త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. ప్యాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ ధనాధన్ అర్ధసెంచరీతో చెలరేగిన వేళ పోరాడే స్కోరు అందుకున్న టీమ్ఇండియా సమష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. పాక్ బౌలర్లను ఉతికిఆరేస్తూ కిషన్ బౌండరీలతో శివతాండవం చేశాడు. బుమ్రా, హార్దిక్ పాక్‌ను ఆదిలోనే దెబ్బతీయగా, అక్షర్, వరుణ్ మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. వీరి ధాటికి 114 పరుగులకే కుప్పకూలిన పాక్ 61 పరుగుల తేడాతో మట్టికరించింది. హ్యాట్రిక్ విజయాలతో డిఫెండింగ్ చాంపియన్ భారత్ టాప్ గేర్‌లో దూసుకెళుతుండగా, పాక్ సూపర్-8 ఆశలు మిణుకుమిణుకుమంటున్నాయి.

ఫార్మాట్ ఏదైనా ప్రపంచకప్ టోర్నీల్లో దాయాది పాకిస్థాన్‌కు చుక్కలు చూపెట్టే టీమ్ఇండియా.. ఆ సంప్రదాయాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తూ మరోసారి విజయ దుందుభి మోగించింది. ఇరుజట్ల మధ్య కొలంబో ఆతిథ్యమిచ్చిన గ్రూప్-ఏ మ్యాచ్‌లో భారత్.. 61 పరుగుల తేడాతో చిరకాల ప్రత్యర్థిని మట్టికరిపించి సూపర్-8 బెర్తును ఖరారు చేసుకుంది. అదీగాక ఐసీసీ టీ20 టోర్నీల్లో పాక్‌పై భారత ఆధిపత్యాన్ని 8-1కు పెంచుకుంది. మ్యాచ్‌లో పాక్ ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా..

ఇషాన్ కిషన్ (40 బంతుల్లో 77, 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌కు తోడు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (29 బంతుల్లో 32, 3 ఫోర్లు) నిలకడైన ఆటతో 20 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 175 రన్స్ చేసింది. ఛేదనలో భారత బౌలర్ల సమష్టి ప్రదర్శనతో పాక్ 18 ఓవర్లకు 114 రన్స్‌కు తోకముడిచింది. ఉస్మాన్ ఖాన్ (34 బంతుల్లో 44, 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా షాహిన్ అఫ్రిది (19 బంతుల్లో 23 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) ఆడకుంటే ఆ జట్టు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. హార్దిక్ (2/16), బుమ్రా (2/17), వరుణ్ (2/17), అక్షర్ (2/29) తలా రెండు వికెట్లు పడగొట్టి పాక్ పనిపట్టారు. ఇషాన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

### పవర్ ప్లేలోనే ఖేల్ ఖతం..

ఇషాన్ మినహా మిగిలిన భారత బ్యాటర్లు ఆచితూచి ఆడిన పిచ్‌పై పాక్ బ్యాటర్లు ఎలా స్పందిస్తారు? అన్న ఉత్కంఠకు తొలి మూడు ఓవర్లలోనే తెరపడింది. పవర్ ప్లేలోనే పాక్ ఓటమి దాదాపుగా ఖాయమైంది. హార్దిక్, బుమ్రా, అక్షర్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆ జట్టు తొలి 6 ఓవర్లలో టాపార్డర్‌ను కోల్పోయి ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. హార్దిక్ తొలి ఓవర్లోనే ప్రమాదకర సాహిబ్‌జాదా ఫర్హాన్‌ను డకౌట్ చేసి పాక్ పతనానికి శ్రీకారం చుట్టాడు. రెండో ఓవర్‌లో బంతినందుకున్న బుమ్రా.. ఐదు బంతుల వ్యవధిలో రెండు కీలక వికెట్లు పడగొట్టి దాయాదిని చావుదెబ్బ కొట్టాడు.

రెండో బంతికి అయూబ్ (6)ను అద్భుతమైన ఇన్‌స్వింగర్‌తో వికెట్ల ముందు బలిగొన్న అతడు.. ఆఖరి బంతికి కెప్టెన్ సల్మాన్ (4)ను బోల్తా కొట్టించాడు. ఐదో ఓవర్‌లో అక్షర్.. బాబర్ ఆజమ్ (5)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో ఆ జట్టు పవర్ ప్లేలో 38/4తో నిలిచింది. ఈ క్రమంలో పాక్‌ను కీపర్ ఉస్మాన్ ఆదుకునే యత్నం చేశాడు. దూకుడుగా ఆడుతూ భారత స్పిన్నర్లను ఎదుర్కున్న అతడు.. షాదాబ్ ఖాన్ (14)తో కలిసి ఐదో వికెట్‌కు 39 రన్స్ జోడించాడు. కానీ అక్షర్ 11వ ఓవర్లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. అంతే..! ఆ తర్వాత పాక్ లోయరార్డర్ తోకముడవడానికి పెద్దగా టైమ్ పట్టలేదు.

### ఇషాన్‌దార్ ఇన్నింగ్స్

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా.. పాక్ పనిపడతాడనుకున్న అభిషేక్ శర్మ వికెట్‌ను ఫస్ట్ ఓవర్లోనే కోల్పోయింది. పాక్ సారథి వేసిన తొలి ఓవర్ ఆఖరి బంతిని పుల్ చేయబోయి మిడాన్‌లో అఫ్రిదికి చిక్కాడు. అభిషేక్ గండాన్ని తప్పించుకున్నామని సంబురపడ్డ పాక్ ఆశలపై ఇషాన్ నీళ్లు చల్లాడు. షాహిన్ బౌలింగ్‌లో సిక్స్‌తో వేట ఆరంభించిన అతడు.. అబ్రర్ ఐదో ఓవర్లో 6, 4 బాదాడు. అతడే వేసిన ఏడో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో అతడి అర్ధశతకం కూడా పూర్తయింది.

దూకుడుగా ఆడే క్రమంలో ఇషాన్‌ను 9వ ఓవర్లో అయూబ్ బౌల్డ్ చేయడంతో 87 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇషాన్ నిష్క్రమణ తర్వాత భారత స్కోరు వేగం తగ్గింది. పాక్ సారథి వరుసగా స్పిన్నర్లతో వేయించి టీమ్ఇండియా భారీ స్కోరుకు అడ్డుకట్ట వేయగలిగాడు. తిలక్, సూర్య క్రీజులో ఉన్నా సింగిల్స్, డబుల్స్‌కే పరిమితమయ్యారు. అయూబ్ ఒకే ఓవర్లో తిలక్, హార్దిక్‌ను ఔట్ చేసి షాకిచ్చినా ఆఖర్లో శివమ్ దూబె (17 బంతుల్లో 27, 3 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (11) మెరుపులతో భారత్ 170 పరుగుల మార్కును దాటేసింది.

### నీలి సముద్రంలా!

భారత్, పాక్ ప్రపంచకప్ మ్యాచ్‌కు అభిమానులు పోటెత్తారు. అసలు పోరు జరుగుతుందా లేదా అన్న అనుమానాలు పటాపంచలు చేస్తూ ఐసీసీ ప్రయత్నాలు సఫలం కాగా, ఫ్యాన్స్ సండే బ్లాక్‌బాస్టర్‌ను ఆస్వాదించారు. మ్యాచ్‌కు వేదికైన ప్రేమదాస స్టేడియానికి ఇరు దేశాల క్రికెట్ అభిమానులు వేల సంఖ్యలో తరలివచ్చారు. స్టేడియంలో ఎటు చూసినా టీమ్ఇండియా జెర్సీలు ధరించిన అభిమానులు వేల సంఖ్యలో ఉండటంతో నీలి సముద్రాన్ని తలపించింది. మెగాటోర్నీకి బ్రాండ్ అంబాసీడర్‌గా వ్యవహరిస్తున్న రోహిత్‌శర్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కప్‌ను స్టేడియంలో తీసుకొచ్చిన హిట్‌మ్యాన్ ఫ్యాన్స్‌తో సందడి చేశాడు. తన భార్య రితికా సజ్దేతో కలిసి వచ్చిన రోహిత్...ఐసీసీ చైర్మన్ జైషా, బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, ఉపాధ్యక్షుడు రాజీవ్‌శుక్లాతో కలిసి మ్యాచ్ వీక్షించాడు.

### నో షేక్‌హ్యాండ్

భారత్, పాకిస్థాన్ మెగా పోరులో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. గతంలో లాగే ఇరు జట్ల కెప్టెన్లు సూర్యకుమార్ యాదవ్, సల్మాన్‌అలీ ఆగా పాత సంప్రదాయాన్నే కొనసాగించారు. మ్యాచ్‌కు ముందు టాస్ వేసే సమయంలో కనీసం ఒకరిని ఒకరు చూసుకోని కెప్టెన్లు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోకుండానే వెనుదిరిగారు. ఇటీవల జరిగిన ఆసియాకప్‌లోనూ రెండు దేశాల సారథులు ఇదే ఒరవడి కొనసాగించారు. టాస్ గెలిచిన పాక్ కెప్టెన్ సల్మాన్ ఆగా..భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఇరు జట్ల ప్లేయర్లు కరచాలనం లేకుండానే డగౌట్‌కు చేరుకున్నారు.

### సంక్షిప్త స్కోర్లు:

భారత్: 20 ఓవర్లకు 175/7 (ఇషాన్ 77, సూర్య 32, అయూబ్ 3/25, అఘా 1/10);

పాకిస్థాన్: 18 ఓవర్లకు 114 ఆలౌట్ (ఉస్మాన్ 44, షాహిన్ 23, హార్దిక్ 2/16, బుమ్రా 2/17)



## అదరగొట్టిన విండీస్

### టోర్నీ నుంచి నేపాల్ ఔట్

ముంబై: టీ20 ప్రపంచకప్‌లో రెండు సార్లు చాంపియన్ వెస్టిండీస్ సూపర్-8 దశకు అర్హత సాధించింది. ఆదివారం ముంబైలోని వాంఖెడే వేదికగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 9 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించి ఈ టోర్నీలో సూపర్-8కు క్వాలిఫై అయిన తొలి జట్టుగా నిలిచింది. విండీస్ ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్.. నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 133 రన్స్ చేసింది. దీపేంద్ర సింగ్ (47 బంతుల్లో 58, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగిలినవారంతా క్రీజులో నిలవడానికే తంటాలు పడ్డారు. విండీస్ బౌలర్లలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' జేసన్ హోల్డర్ (4/27) నాలుగు వికెట్ల ప్రదర్శన చేయగా హోసెన్, ఫోర్డ్, జోసెఫ్, ఛేజ్ చెరో ఒక వికెట్ తీశారు. కరీబియన్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీసి నేపాల్‌పై ఒత్తిడి పెంచడంతో ఆ జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది.

అనంతరం ఛేదనకు వచ్చిన విండీస్.. కెప్టెన్ షై హోప్ (44 బంతుల్లో 61 నాటౌట్, 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), షిమ్రన్ హిట్‌మైర్ (32 బంతుల్లో 46 నాటౌట్ , 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో 15.2 ఓవర్లలో లక్ష్యాన్ని పూర్తిచేసింది. గ్రూప్-సీలో భాగంగా లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలిచిన వెస్టిండీస్.. 6 పాయింట్లతో సూపర్-8 బెర్తును ఖాయం చేసుకుంది. నేపాల్ మూడింట్లో మూడూ ఓడి రేసు నుంచి నిష్క్రమించింది.

## అమ్మాయిల బోణీ

### తొలి టీ20లో ఆసీస్‌పై గెలుపు

### మెరిసిన హైదరాబాదీ పేసర్ అరుంధతి



సిడ్నీ: ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తర్వాత భారత మహిళల జట్టు ఆడిన తొలి మ్యాచ్‌లోనే సత్తాచాటింది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. కంగారూలతో సిడ్నీలో వర్షం అంతరాయం కల్గించిన తొలి మ్యాచ్‌లో ప్రత్యర్థిని 21 పరుగుల (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) తేడాతో ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి (4/22) కెరీర్ బెస్ట్ ప్రదర్శనకు తోడు రేణుకా సింగ్ ఠాకూర్ (2/14) పవర్ ప్లేలో కట్టుదిట్టమైన బౌలింగ్‌తో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 18 ఓవర్లలో 133 పరుగులకే కుప్పకూలింది. జార్జియా వర్హైమ్ (19 బంతుల్లో 30, 4 ఫోర్లు) టాప్ స్కోరర్. తెలుగమ్మాయి శ్రీచరణి (2/14) రెండు వికెట్లు తీసింది. స్వల్ప ఛేదనలో బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. 5 ఓవర్లలోనే 50 రన్స్ దంచేసింది. షెఫాలీ వర్మ (11 బంతుల్లో 21, 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడింది. వర్షం వచ్చే సమయానికి లక్ష్యానికంటే 21 రన్స్ ఎక్కువగా ఉండటంతో భారత్ విజేతగా నిలిచింది. ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాను ఓడించడం (టీ20ల్లో) భారత్‌కు ఆరేండ్ల తర్వాత ఇదే ప్రథమం.



## రాహుల్, పడిక్కల్ శతకాలు

లక్నో: రంజీ ట్రోఫీ సెమీస్ పోరును కర్ణాటక తొలిరోజు ఘనంగా ఆరంభించింది. లక్నోలో ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న తొలి సెమీస్‌లో స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (211 బంతుల్లో 141, 11 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (236 బంతుల్లో 148 నాటౌట్, 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీ శతకాలతో రాణించారు. ఈ ఇద్దరి సెంచరీలతో మొదటిరోజు కర్ణాటక 90 ఓవర్లకు 355/2 పరుగుల భారీ స్కోరు సాధించింది.

జమ్మూకాశ్మీర్‌తో జరుగుతున్న రెండో సెమీస్‌లో తొలుత బ్యాటింగ్ చేస్తున్న బెంగాల్.. మొదటి రోజు 249/5 చేసింది. సుదీప్ కుమార్ (136 బ్యాటింగ్) సెంచరీ చేశాడు.

## నమీబియాకు అమెరికా షాక్

చెన్నై: రెండో టీ20 ప్రపంచకప్ ఆడుతున్న యూఎస్ఏ తమకంటే మెరుగైన జట్లకు షాకులిస్తున్నది. గ్రూప్-ఏలో ఆ జట్టు.. 31 పరుగుల తేడాతో నమీబియాపై గెలిచి ఈ టోర్నీలో సమష్టిగా రాణించి రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 199 రన్స్ చేసింది.

భారత సంతతి ఆటగాళ్లు సంజయ్ కృష్ణమూర్తి (33 బంతుల్లో 68 నాటౌట్, 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) వీరవిహారానికి తోడు మోనాంక్ పటేల్ (30 బంతుల్లో 52, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఛేదనలో నమీబియా 168/6 వద్దే ఆగిపోయింది. స్టీన్‌క్యాంప్ (39 బంతుల్లో 58, 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్మిత్ (31) పోరాడినా ఆ జట్టుకు ఓటమి తప్పలేదు.

# బల్దియాలో బలాల పోరు తారాస్థాయికి

## మేయర్ పీఠం కోసం చివరి నిమిషం రాజకీయాలు

కాంగ్రెస్ అధిష్ఠానం చక్రం తిప్పింది

మల్లిఖార్జున రాజేందర్ పేరు ఫైనల్ దశలో

క్యాంప్ రాజకీయాలతో హీటెక్కిన కరీంనగర్



మల్లిఖార్జున రాజేందర్
(కాంగ్రెస్ బల పరచాలనుకుంటున్న అభ్యర్థి )



కొలగని శ్రీనివాస్
(బీజేపీ బల పరచాలనుకుంటున్న అభ్యర్థి )




కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠం కోసం రెండు రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. సోమవారం జరగనున్న మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ముందు నగర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. స్పష్టమైన మెజారిటీ ఏ పార్టీకి లేకపోవడంతో కార్పొరేటర్ల మద్దతు కోసం అన్ని పార్టీలు చివరి నిమిషం వరకు వ్యూహాలు అమలు చేస్తున్నాయి.

కార్పొరేషన్ ఎన్నికల్లో 30 స్థానాలు గెలిచిన బీజేపీ మొదట మేయర్ పీఠం తమదేనని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, అనూహ్యంగా మారుతున్న సమీకరణాలు ఆ పార్టీకి సవాలుగా మారాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా చక్రం తిప్పినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఫార్వర్డ్ బ్లాక్, ఎంఐఎం, ఇండిపెండెంట్లతో చర్చలు జరిపి సమీకరణాలు కుదర్చేందుకు కాంగ్రెస్ నేతలు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో మేయర్ అభ్యర్థిగా ముందుగా బీజేపీ రెబల్ కార్పొరేటర్ కొమురయ్య పేరును పరిశీలించినట్టు ప్రచారం జరిగింది. అయితే తరువాత కాంగ్రెస్ నుంచి గెలిచిన మల్లిఖార్జున రాజేందర్ పేరు బలంగా ముందుకు రావడంతో అధిష్ఠానం ఆయన పేరును ఖరారు చేసినట్టు పార్టీలో ప్రచారం జోరందుకుంది. గాంధీభవన్ నుంచి అధికారిక ప్రకటన ఎప్పుడైనా వెలువడే అవకాశం ఉందని సమాచారం. మేయర్ ఎన్నికల ముందు నగరంలో క్యాంప్ రాజకీయాలు హాట్ టాపిక్‌గా మారాయి. బీజేపీ, కాంగ్రెస్ శిబిరాలు తమ తమ కార్పొరేటర్లను ఒకేచోట ఉంచి వ్యూహాలు రచిస్తున్నాయి. మహిళా కార్పొరేటర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులను క్యాంపులకు తరలించినట్టు కూడా ప్రచారం సాగుతోంది. స్వతంత్ర కార్పొరేటర్ల మద్దతు కోసం రెండు ప్రధాన పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ విఫల సాయి జ్యోతి ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆమెను తమవైపు తిప్పుకునేందుకు రెండు పార్టీల నేతలు ప్రయత్నించినట్టు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. అనంతరం జ్యోతి విడుదల చేసిన వీడియో రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. సోమవారం జరిగే ఎన్నికల్లో తనకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తానని ఆమె పేర్కొనడం ఆసక్తిని రేపింది. మేయర్ పీఠంపై చివరి నిమిషం వరకు సమీకరణాలు మారే అవకాశం ఉండటంతో నగర రాజకీయాల్లో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది.

### మేయర్ పీఠంపై బీజేపీ ఆశలు

**కొలగాని శ్రీనివాస్ పేరు హాట్ టాపిక్.. వాసాల రమేష్ పేరు కూడా పరిశీలనలో**

కరీంనగర్ కార్పొరేషన్‌లో అతిపెద్ద పార్టీగా నిలిచిన బీజేపీ మేయర్ పీఠంపై ఆశలు వదల్లేదు. ఒకవేళ పరిస్థితులు అనుకూలిస్తే రెండో డివిజన్ నుంచి గెలిచిన కొలగాని శ్రీనివాస్ పేరు మేయర్ అభ్యర్థిగా బలంగా వినిపిస్తోంది. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఆయనకు మేయర్ పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక వాసాల రమేష్ పేరు కూడా అంతర్గత చర్చల్లో వినిపిస్తోంది. అయితే సంఖ్యాబలం, మద్దతు సమీకరణాల దృష్ట్యా కొలగాని శ్రీనివాస్‌కే ప్రాధాన్యం ఉండొచ్చని రాజకీయ విశ్లేషకుల అంచనా. సోమవారం జరిగే మేయర్ ఎన్నికల వరకు పరిస్థితులు ఎలా మారుతాయన్నది స్పష్టంగా తెలియకపోయినా, చివరి నిమిషం వరకు బీజేపీ కూడా తన వ్యూహాలను అమలు చేస్తూ మేయర్ పీఠంపై పట్టు సాధించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది.

# మున్సిపల్ చైర్మన్ పదవి ఎవరికి...

## నిస్వార్థంగా కొన్నేండ్లుగా కాంగ్రెస్ జెండా మోసిన చేతులకా...

**పార్టీ మార్పు-అవకాశవాద రాజకీయ నాయకుల చేతులకా...**

**కోరుట్ల ప్రజల్లో విస్తృతంగా జరుగుతున్న చర్చలు...**

కోరుట్ల నియోజకవర్గం, జనతా న్యూస్: కోరుట్ల పట్టణంలో మున్సిపల్ చైర్మన్ పదవి కేటాయింపుపై ప్రజల్లో చర్చలు జోరుగా సాగుతున్నాయి. అవకాశవాద రాజకీయాలతో పార్టీ జెండా మారుస్తూ స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాలు చేసే వారికి కాకుండా, కొన్నేండ్లుగా పార్టీని నమ్ముకొని పార్టీ జెండా భుజాన మోస్తూ నిస్వార్థంగా ప్రజల మధ్య నిలబడి సేవ చేసిన నిజమైన నిబద్ధత గల కార్యకర్త-నాయకులకే గుర్తించి మున్సిపల్ చైర్మన్ పదవిని ఇవ్వాలని స్థానిక ప్రజల్లో బలమైన అభిప్రాయం వ్యక్తమవుతోంది.కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో అండగా నిలబడి, ప్రజల సమస్యల కోసం నిరంతరం పని చేసిన వారినే గుర్తించి గౌరవించాలని పట్టణ ప్రజలు భావిస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చలు వినిపిస్తున్నాయి.పదేండ్లు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా అక్కడ ప్రయోజనాలు పొంది ఎందరో నిస్వార్థ కాంగ్రెస్ కార్యకర్తలను నాయకులను, కాంగ్రెస్ పార్టీని హేళన-ఎగతాళి చేసిన వారు స్వార్థ ప్రయోజనాలకై ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో కొందరు చేరి అసలు కాంగ్రెస్ కార్యకర్త నోటికాడ ముద్దను లాక్కొబోతున్నారని ఇది నిజమైన క్రియాశీల కార్యకర్తలకు అన్యాయమే జరుగుతుందేమోనన్న ఆరోపణలు ఉన్నాయి. జెండా మోసి ప్రజా సేవ చేసిన వారికి గౌరవం దక్కాలి... అవకాశవాదులకు కాదు...అనే భావనతో ప్రజల్లో హల్చల్ నెలకొన్నట్లు సమాచారం. మున్సిపల్ చైర్మన్ ఎంపికలో పార్టీ అధిష్ఠానం ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# కరీంనగర్‌లో బీజేపీకి మెజారిటీ లేదన్న మంత్రి పొన్నం

**నిజామాబాద్ ఉదాహరణతో రాజకీయ వ్యాఖ్యలు**

**మేయర్ ఎంపిక ప్రజాస్వామ్య ప్రక్రియలోనే జరుగుతుందన్నారు**



వేములవాడ/కరీంనగర్, జనతా న్యూస్:
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ లేదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఉదాహరణగా ప్రస్తావిస్తూ ఆయన రాజకీయ వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో మొత్తం 60 స్థానాలు ఉండగా బీజేపీకి 28 సీట్లు మాత్రమే ఉన్నాయని, అక్కడ కూడా మెజారిటీ లేకుండా ప్రతిపక్షంలో కూర్చుంటామని బీజేపీ నాయకులు అన్నారని గుర్తు చేశారు. ఇదే పరిస్థితి కరీంనగర్‌లోనూ ఉందని మంత్రి పేర్కొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లు ఉండగా ఎంపీ, స్థానిక ఎమ్మెల్యేలు కలిపి మొత్తం సభ్యులు 69కి చేరుతారని, అందులో బీజేపీకి 30 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మేయర్ పదవి తమదేనని బీజేపీ ప్రకటించడం ఎలా సమంజసం అవుతుందో ప్రజలే నిర్ణయించుకోవాలని మంత్రి అన్నారు. ఇతర పార్టీలకు కూడా తమ తమ వ్యూహాలు ఉంటాయని, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే మేయర్ ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ 13 సీట్లు గెలిచినప్పటికీ కరీంనగర్‌లో మేయర్ పదవి దక్కించుకున్నామని గుర్తు చేశారు. రాజకీయ పార్టీగా ఎవరికీ వ్యతిరేకంగా వ్యవహరించడం లేదని, మెజారిటీ ఉన్నవారికి అడ్డంకులు కల్పించే ఉద్దేశం లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విధానంలో గెలిచిన కార్పొరేటర్లు కలిసి మేయర్‌ను ఎన్నుకుంటారని, ముఖ్యమంత్రి లేదా మంత్రుల జోక్యం ఉండదని అన్నారు. స్థానికంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ ఆలోచన ప్రకారం వ్యవహరిస్తారని తెలిపారు. కరీంనగర్ నగర అభివృద్ధి కోసం అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని మంత్రి ఆకాంక్షించారు. బీజేపీకి గెలిచిన 30 మంది కార్పొరేటర్లకు, మిగతా పార్టీలకు చెందిన సభ్యులకు కూడా అభినందనలు తెలిపారు. ఉత్తర తెలంగాణలో కీలకమైన కరీంనగర్ నగర అభివృద్ధి కోసం మంచి పాలకవర్గం ఏర్పడాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. మేయర్ ఎన్నికలపై అన్ని రాజకీయ పార్టీలు సమీకరణాలు పరిశీలిస్తున్నాయని, 16వ తేదీ జరిగే ఎన్నికలో తుది ఫలితం ఎలా ఉంటుందో చూడాలని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే నిర్ణయం తీసుకుంటామని, రాజకీయ లాభనష్టాల కంటే నగర అభివృద్ధికే ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

# సుందరగిరిలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు..

పెద్ద ఎత్తున హాజరైన భక్తులు..




చిగురుమామిడి,జనత న్యూస్:మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలను నిర్వాకులు ఆదివారం వైభవంగా నిర్వహించారు.మండలంలోని సుందరగిరి గ్రామంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన పురాతన శివాలయంలో వేకువ జామునుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు శివుడికి రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు చేస్తుండడంతో శివనామస్మరణతో మారుమోగడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.కళ్యాణంతోపాటు హోమం,ఊరేగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.భక్తులు ఆలయం వద్ద కోడెమొక్కులను చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,గ్రామ సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి,ఆలయ చైర్మన్ బాకం ఆంజనేయులు,ఉపసర్పంచ్ మెడబోయిన రాజు,మాజీ సర్పంచ్ శ్రీమూర్తి రమేష్, బూట్ల కవిత శ్రీనివాస్, బాకం చిన్న అంజయ్య,పత్రి రాజు,బొజ్జ మల్లేష్,బాకం వీరేషం, గీరబోయిన శ్రీకాంత్, ఎనగందుల శివకుమార్, బాకం పెద్ద అంజయ్య,కేంశెట్టి శంకర్,బాకం సంతోష్, సదానందం, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రమాణ స్వీకారం, మేయర్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**సోమవారం మధ్యాహ్నం వరకు పౌర సేవలు నిలిపివేత**

**వెబ్‌కాస్టింగ్ మధ్య మేయర్, డిప్యూటీ మేయర్ పరోక్ష ఎన్నిక**





కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ నగరపాలక సంస్థలో నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, మేయర్ మరియు డిప్యూటీ మేయర్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. పాలకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సోమవారం జరిగే ప్రమాణ స్వీకారం, మేయర్--డిప్యూటీ మేయర్ ఎన్నికల ఏర్పాట్ల దృష్ట్యా నగరపాలక సంస్థలో పౌర సేవలను మధ్యాహ్నం వరకు నిలిపివేసినట్లు తెలిపారు. సంబంధిత కార్యక్రమాల కారణంగా సోమవారం మధ్యాహ్నం వరకు నగరపాలక సంస్థ కార్యాలయానికి సాధారణ ప్రజలకు ప్రవేశం ఉండదని పేర్కొన్నారు. ఆస్తి పన్ను చెల్లింపులు చేయాల్సిన వారు ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సోమవారం ఉదయం నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం ఆల్ఫాబెటికల్ క్రమంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు సమావేశ మందిరంలో పాలకవర్గ సభ్యుల ద్వారా మేయర్, డిప్యూటీ మేయర్ పరోక్ష ఎన్నిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ఎన్నికకు ఆర్డీవో ప్రెసిడింగ్ అధికారిగా వ్యవహరిస్తారని చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మొత్తం ప్రక్రియ వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల నిఘా మధ్య పారదర్శకంగా నిర్వహించబడుతుందని, ప్రతి దశను రికార్డు చేయనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. మీడియా ప్రతినిధుల కోసం నగరపాలక సంస్థ ఆవరణలో ప్రత్యేక మీడియా పాయింట్ ఏర్పాటు చేసి, లైవ్ స్క్రీన్ ద్వారా కార్యక్రమాన్ని వీక్షించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రమాణ స్వీకారం మరియు మేయర్ ఎన్నికల సందర్భంగా నగరపాలక సంస్థ వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# పొట్లపల్లి రాజన్నకు మంత్రి పొన్నం పట్టువస్త్రాల సమర్పణ

హుస్నాబాద్, జనత న్యూస్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని పొట్లపల్లి గ్రామంలో వెలసిన స్వయంభూ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం దర్శించుకున్నారు.ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలందరూ పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ రాజరాజేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.వచ్చే శివరాత్రి నాటికి గౌరవెల్లి ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేసుకుని, కాలువల ద్వారా సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఆ శివయ్య ఆశీస్సులతో ఈ పనులన్నీ త్వరితగతిన పూర్తి కావాలని కోరుకున్నట్లు చెప్పారు.ప్రస్తుతం ప్రజా పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా విజయవంతంగా కొనసాగాలని మంత్రి ఆకాంక్షించారు.భవిష్యత్తులో మరిన్ని



సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తామని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.





# భక్తులతో కిటకిటలాడిన మృత్యుంజయ ఆలయం

తిమ్మాపూర్, జనతా న్యూస్ : లోయర్ మానేరు జలాశయం తీరాన ఎల్ఎండి కాలనీలోని శ్రీ గిరిజా మృత్యుంజయ మహా దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివరాత్రిని పురస్కరించుకొని ఎల్ఎండి లోని గిరిజామృత్యుంజ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కరీంనగర్ తో పాటు వివిధ ప్రాంతాల నుండి, తిమ్మాపూర్ మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ఆలయం శివనామస్మరణతో మారుమ్రోగింది. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం వేకువజామున మొదలైన అభిషేక కార్యక్రమాలు సాయంత్రం వరకు కొనసాగాయి. భక్తులు శివలింగంపై పంచామృతాభిషేకాలు, ఫలాలు, విభూది తో అభిషేకాలు నిర్వహించి శివునికి బిల్వపత్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ చైర్మన్ చల్ల మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణరావు ఆర్థిక కార్య దర్శులు బాలకిషన్ రావు, బట్టు కరుణాకర్, వెంకటాచారి తో పాటు ఆలయ కమిటీ సభ్యులు దాతల సహకారంతో అన్ని ఏర్పాట్లను చేశారు. సాయంత్రం నుండి అర్ధ రాత్రి వరకు



బస్మాభిషేకం, నిషి పూజ కార్యక్రమాల అనంతరం బిల్వదళ సమర్పణ తో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయంలో శివరామకృష్ణ భజన మండలి వారి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు జరిగాయి. అభిషేక కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పొన్నాల సంపత్, మాజీ ఎంపీపీ వనిత దేవేందర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘము అధ్యక్షుడు ఖాలి చరణ్, ప్రధాన కార్యదర్శి అరవింద్ రెడ్డి, ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా, మిట్టపల్లి రమేష్, పశుసంవర్ధక శాఖ అధికారులు లింగారెడ్డి, వేణుగోపాలరావు, వినోద్, సురేందర్ రెడ్డి, శ్రవణ్, మౌనిక, భారతి, ఎలక్ట్రిసిటీ సిజిఎం మాధవరావు, ఉద్యోగ సంఘ నాయకులు మామిడి రమేష్, పోలు కిషన్, గంగాపు రమేష్, గూడ ప్రభాకర్ రెడ్డి, ఒంటెల రవీందర్ రెడ్డి, ఒంటెల ప్రసాద్ రెడ్డి, కొలుగూరి వెంకటేశ్వరరావు, రామస్వామి, బుర్ర రాజయ్య, ధనలక్ష్మి, వీణ, చంద్రకళ, గిరిజా సుహాసిని మహిళా మండలి సభ్యులు సమత, విజయ పరమేశ్వరి పాల్గొన్నారు. దాతలను ఉద్యోగ సంఘ నాయకులను ఆలయ కమిటీ సన్మానించారు.





# ‘కేడం’ ఓటమికి కారణమెవరూ..!

**సొంత పార్టీలోనే కోవర్టులు**

**రాజకీయంగా ఎదగకుండా అడ్డుకట్ట?**

**నియోజకవర్గస్థాయి నాయకుని ‘హస్తం’ ఉన్నట్లు ప్రచారం**

హుస్నాబాద్,జనత న్యూస్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని వదులుకుని.. హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠమే లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచిన కేడం లింగమూర్తికి ఊహించని పరాభవం ఎదురైంది. ఆయన మున్సిపాలిటీలోని 17వ వార్డు నుంచి పోటీ చేశారు. ఆయన గెలుపు నల్లేరుపైనడక అనే భావించారు అందరు. కానీ ఫలితాలు మాత్రం ఆయనతోపాటు ఆయన అనుచరులకు కూడా షాక్ ఇచ్చింది. అయితే ఆయన ఓటమి వెనుక స్థానిక రాజకీయ సమీకరణలు, సొంత పార్టీలోని అంతర్గత విభేదాలు, వ్యక్తిగత వైరం వంటి అనేక అంశాలు దాగి ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొన్నం ప్రభాకర్‌కు లింగమూర్తి బహిరంగంగా మద్దతు ప్రకటించారు. అదే సమయంలో కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన ఒక కీలక నేత.. తన సీటు చేజారడానికి లింగమూర్తి కూడా ఒక కారణమని బలంగా నమ్ముతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మున్సిపల్ ఎన్నికల్లో లింగమూర్తిని దెబ్బకొట్టాలనే ఉద్దేశంతో సదరు నేత ప్రత్యర్థి అభ్యర్థికి ఆర్థికంగా.. రాజకీయంగా అండగా నిలిచినట్లు పొలిటికల్ సర్కిల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు 17వ వార్డులో గట్టి పట్టున్న మరో కాంగ్రెస్ నేత కూడా ఈ ఎన్నికల్లో లింగమూర్తి గెలుపునకు సహకరించలేదనే ఆరోపణలు వస్తున్నాయి. లింగమూర్తి గెలిచి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని అధిరోహిస్తే వార్డులో తన ఆధిపత్యం తగ్గిపోతుందని సదరు నాయకుడు పట్టనట్లు వ్యవహరించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆయన ‘కోవర్టు’ రాజకీయాలకు పాల్పడినట్లు సమాచారం. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అత్యంత సన్నిహితుడైన వ్యక్తి గెలిస్తే భవిష్యత్తులో తమ రాజకీయ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని భావించిన సొంత పార్టీ నేతలే ఆయనకు సహకరించలేదని స్పష్టమవుతోంది. జిల్లా స్థాయి పదవిని వదులుకుని మున్సిపల్ చైర్మన్ కావాలన్న లింగమూర్తి లక్ష్యం నెరవేరకపోవడంతో ఆయన అనుచరవర్గంలో తీవ్ర నైరాశ్యం నెలకొంది. పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు, వ్యూహాత్మక తప్పిదాలే ఈ పరాజయానికి దారితీశాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# వేములవాడలో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

## రాజరాజేశ్వర స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజల్లో పాల్గొనం

## రాజరాజేశ్వర స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది
## శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు






వేములవాడ, జనతా న్యూస్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మహా శివరాత్రి సందర్భంగా భీమేశ్వర ఆలయంలో స్వామివారికి సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్ భక్తులతో కలిసి దర్శనం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం రాష్ట్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమని, దక్షిణ కాశిగా పేరుగాంచిందన్నారు. గతంలో ఆలయ అభివృద్ధి కోసం పోరాటం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వేములవాడ రాజన్న ఆశీర్వాదంతో రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం, సమ్మక్క--సారలమ్మ ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వేములవాడ రాజన్న ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. మహా శివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేములవాడ ఆలయాన్ని సుమారు రూ.150 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసే పనులు కొనసాగుతున్నాయని, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఆలయ అభివృద్ధిపై పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని వెల్లడించారు. మహా శివరాత్రి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

### శ్రీ భీమేశ్వరస్వామిని దర్శించుకున్న ఇంచార్జి కలెక్టర్

వేములవాడ, ఫిబ్రవరి 15: మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి వారిని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, "మే ఐ హెల్ప్ యూ" డెస్క్‌లను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న మందులు, సేవలపై వివరాలు తెలుసుకున్నారు. హెల్ప్ డెస్క్ సిబ్బందితో మాట్లాడి భక్తులకు అందిస్తున్న మార్గదర్శకంపై ఆరా తీశారు. అనంతరం క్యూ లైన్ల వద్దకు వెళ్లి భక్తులతో మాట్లాడిన ఆమె, అక్కడి సౌకర్యాలు, ఏర్పాట్లపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్లు భక్తులకు తాగునీరు పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వైద్యులు, సిబ్బంది, హెల్ప్ డెస్క్ బాధ్యులకు పలు సూచనలు చేశారు.

### కమాండ్ కంట్రోల్ రూం పరిశీలన

భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే కలిసి పరిశీలించారు. జాతర సమయంలో భద్రతా ఏర్పాట్లు, సమన్వయంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బద్ది పోచమ్మ ఆలయంలో ఇంచార్జి కలెక్టర్ పూజలు

**వేములవాడ, ఫిబ్రవరి 15:** మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలోని బద్ది పోచమ్మ ఆలయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదివారం పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఆమెకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదం కౌంటర్లను ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ విధానం, పారిశుధ్య ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పారిశుధ్య కార్మికులతో కూడా మాట్లాడి, జాతర సందర్భంగా పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.







### శివతాండవ స్తోత్రం ఆలపించిన ఇంచార్జి కలెక్టర్

వేములవాడ, ఫిబ్రవరి 15: మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శివార్చన వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, భక్తి పరవశంతో శివతాండవ స్తోత్రాన్ని ఆలపించారు. ఆమె ఆలపించిన శివతాండవ స్తోత్రం భక్తులను ఆకట్టుకోగా, కార్యక్రమానికి హాజరైన భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. జాతర సందర్భంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు.





# 18 నుండి యాదగిరిగుట్ట దేవస్థానం బ్రహ్మోత్సవాలు

## ఈ నెల 18 నుండి 28 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు



యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 18 నుండి వార్షిక బ్రహ్మోత్సవాలు షురూ కానున్నాయి. 18 నుండి 28 వరకు.. 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. దీనికి సంబంధించిన వివరాలను ఆలయ ఈవో భవానీ శంకర్ ఆదివారం ప్రెస్ మీట్ పెట్టి వెల్లడించారు. 18న విష్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురారోపణం పూజలతో వార్షిక బ్రహ్మోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టనున్నారు. ఇక బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టాలు 24న స్వామివారి ఎదుర్కోలు, 25న తిరుకల్యాణ మహోత్సవం, 26న దివ్యవిమాన రథోత్సవం నిర్వహించనున్నారు. 28న నిర్వహించే అష్టోత్తర శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవం పూజలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఇక బ్రహ్మోత్సవాల కారణంగా నిత్యం భక్తులచే నిర్వహింపబడే ఆర్జిత సేవలైన నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం వంటి పూజలను 28 వరకు తాత్కాలికంగా రద్దు చేశారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన అనంతరం 29 నుండి ఆర్జిత సేవలను తిరిగి పునరుద్ధరణ చేయనున్నారు.

### బ్రహ్మోత్సవాల కోసం ఏర్పాట్లు ముమ్మరం

ఈ నెల 18 నుండి యాదగిరిగుట్ట టెంపుల్ వార్షిక బ్రహ్మోత్సవాలు షురూ కానున్న నేపథ్యంలో.. మౌలిక సదుపాయాలు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, ఆలయాన్ని ముస్తాబు చేసే పనుల్లో ఆఫీసర్లు నిమగ్నమయ్యారు. ప్రధానాలయ ముఖ మంటపం, హనుమాన్ టెంపుల్, ఆండాళ్ అమ్మవారి ఆలయాలకు లైటింగ్, విద్యుత్ దీపాలను అలంకరించి పనులు వేగంగా జరుగుతున్నాయి. అలాగే సప్తగోపుర ప్రధానాలయ సముదాయానికి ప్రత్యేక లేజర్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి యాదగిరిగుట్టకు వచ్చే ప్రధాన రహదారులతో పాటు యాదగిరిగుట్ట టౌన్ లో స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. తుర్కపల్లి, రాయగిరి, వంగపల్లి, యాదగిరిపల్లిలో భక్తులకు స్వాగతం పలికేలా ఆర్చీలను ఏర్పాటు, ప్రత్యేక లైటింగ్ పనులు చకచకా జరుగుతున్నాయి. మరోవైపు బ్రహ్మోత్సవాల సందర్భంగా హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని ప్రధానాలయాల నుండి యాదగిరిగుట్టకు ప్రత్యేక బస్సులను నడపడానికి ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఈ నెల 25న రాత్రి స్వామివారి కల్యాణం సందర్భంగా.. తిరుగు ప్రయాణ భక్తుల కోసం లేట్ నైట్ వరకు బస్సులను అందుబాటులో ఉంచనున్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com